ప్రజాశక్తి

శుక్రవారం 28 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

లులూకు హోల్ సేల్‌గా 99 ఏళ్లు

◆ నగరం నడిబొడ్డున 13.43 ఎకరాల లీజు ◆ గతంలో వివాదం... అయినా 'కూటమి' ఇష్టారాజ్యం

◆ రూ.1500 కోట్ల విలువైన స్థలం సహా రాయితీలు, నజరానాలు, మినహాయింపులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పక్కాగా ఇది ప్రైవేట్ గుత్త సంస్థకు సాగిలపడడమే..!. సుమారు రూ.1500 కోట్ల విలువైన 13.43 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ లులూకు కూటమి ప్రభుత్వం కట్టబెట్టడం నేడు చర్చనీయాంశమవుతోంది. దీనిపై గతంలోనూ అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నగరం నడిబొడ్డున ఆర్‌కె బీచ్‌కు ఎదురుగా ప్రభుత్వ స్థలాల పందేరంపై 2014-16 మధ్య కాలంలో పెద్ద దుమారమే చెలరేగింది. ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కారుచౌకగా అప్పగించకూడదన్న వాదనలు బలంగా వినిపించాయి. ఇలా పలు అభ్యంతరాల నడుమ 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ భూములను ఎపిఐఐసి నుంచి వియంఆర్‌డిఎ పరిధిలోకి తేవడమే గాకుండా ఆ లీజును రద్దు చేసింది. 2024లో అధికారం చేపట్టిన టిడిపి 'కూటమి' ప్రభుత్వం అదే లీజు వ్యవహారాన్ని తాజాగా పునర్జీవింపజేసింది. ఏకంగా 99 ఏళ్ల పాటు లీజుకు లులూకిచ్చేసింది. అందుకోసం చంద్రబాబు ప్రభుత్వం వియంఆర్‌డిఎ పరిధిలో ఉండే ఆ భూములను ఎపిఐఐసికి బదిలీ చేయాలని ఈ నెల 26న ఆదేశాలు జారీచేయడం అంతటా చర్చనీయాంశమైంది.

లులూకు ప్రభుత్వం అప్పగించనున్న స్థలమిదే..

విశాఖలో లులూ కథ ఇదీ...

విశాఖ నగరం నడిబొడ్డున హార్బర్ పార్కు భూములను లులూ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నెల 13న రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పెట్టుబడుల సమావేశంలో లులూ సంస్థను ప్రభుత్వం ఫైనలైజ్ చేసింది. చంద్రబాబు ప్రభుత్వం గతంలో ఆర్‌కె బీచ్ ఎదురుగాగల సిఎంఆర్‌కు చెందిన విశ్వప్రియ ఫంక్షన్ హాలును లులూకు ఇచ్చేసింది. అదే సమయంలో నగరంలోని సీతమ్మధార, ఎంవిపి.కాలనీ, సిరిపురం ప్రాంతాల్లోని నగర నడిబొడ్డునగల మిగతా 2లో..

హార్బర్ పార్క్ భూములను లులూకు కట్టబెట్టొద్దు

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తిరిగి హార్బర్ పార్క్ భూములను లులూ సంస్థకు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకోవడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూములను కారు చౌకగా లులూ సంస్థకు కట్టబెట్టడమేంటని ప్రశ్నించారు. ఇది విశాఖ అభివృద్ధికి దోహదపడకపోగా తీవ్ర హాని చేసే చర్యని పేర్కొన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆ స్థలాన్ని సైన్స్ మ్యూజియం వంటి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు. ఆర్‌కె బీచ్ వద్ద వున్న సుమారు రూ.1500 కోట్ల విలువ కలిగిన 13.43 ఎకరాల ప్రభుత్వ భూమిని లులూ సంస్థకు కేటాయిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం చేసిందన్నారు. వియంఆర్‌డిఎ ఆధీనంలో ఉన్న ఈ భూమిని వెంటనే ఎపిఐఐసికి బదిలీ చేయాలని ఆదేశాలు కూడా ఇచ్చిందన్నారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉండగా 2019లో ఆ భూమిని లులూ సంస్థకు కేటాయించగా ఆతరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసిందన్నారు. ఇప్పుడు తిరిగి కూటమి ప్రభుత్వం ఆ భూమిని లులూ సంస్థకు కారు చౌకగా కట్టబెట్టాలని నిర్ణయించిందన్నారు. ఈ నిర్ణయం విశాఖకు తీవ్ర హాని కలిగించడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. ప్రతి మిగతా 2లో..

కారుచౌకగా ఖరీదైన భూమి ఇచ్చేస్తారా : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్‌కె బీచ్‌కు సమీపంలో సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా లులూ మాల్‌కు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇచ్చే సందర్భంలో పాటించాల్సిన నిబంధనలకు పాతర వేస్తూ ఏకంగా 99 ఏళ్లకు లీజుకు ఇచ్చేందుకు సిద్ధపడటం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా ఏకంగా రూ.170 కోట్ల విలువైన రాయితీలను కూడా సదరు సంస్థకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం తెగబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

▸ వార్త 2లో..

నేటి నుంచి ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మె

▸ వార్త మెయిన్‌లో...

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

▸ వార్త 8లో..

నాటకోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

తెలుగు నాటకాలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు నాటకాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ నాటక దినోత్సవాలను పురస్కరించుకొని రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'లీడర్ విశాఖ జాతీయ నాటకోత్సవాలు -2025' పిఠాపురం కాలనీలోని కళాభారతిలో గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు నాటకాలను అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయని తెలిపారు. ఏప్రిల్ 16న కందుకూరి వీరేశలింగం జయంతిని తెలుగు నాటక దినోత్సవంగా జరపనున్నామన్నారు. త్వరలో జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ తరహా కార్యక్రమాలను మిగతా 2లో..

ఎంపిపి పదవులు పదిలం

ఉప ఎన్నికల్లో నాలుగింటినీ నిలబెట్టుకున్న వైసిపి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో నాలుగు ఎంపిపిలను వైసిపి నిలబెట్టుకుంది. గత ఒప్పంద ప్రకారం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తికావడంతో ముగ్గురు ఎంపిపిలు వారి పదవులకు రాజీనామా చేశారు. అలాగే గత సాధారణ ఎన్నికలకు ముందు టిడిపిలో చేరడంతో ఒక ఎంపిపి వైసిపికి, తన పదవికి రాజీనామా చేశారు. ఆ పదవులకు గురువారం జరిగిన ఎన్నికల్లో నాలుగు ఎంపిపి స్థానాలనూ తిరిగి వైసిపి తన ఖాతాలో వేసుకుంది. గత ఎన్నికల్లో జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే స్థానంలోనూ వైసిపి గెలవకపోయినా తాజాగా మండల పరిషత్‌లను కాపాడుకోగలిగింది. ఎన్నికలు జరిగిన మండలాల్లో మెజార్టీ ఎంపిటిసిలు వైసిపికి చెందినవారు ఉండడంతో ఎంపిపి పదవుల విషయాన్ని టిడిపి పెద్దగా పట్టించుకోలేదు. ఎంపిటిసిలు వైసిపిలో చురుగ్గా పనిచేయడంతో

మాడుగుల ఎంపిపిగా ఎన్నికైన రాజారాంను అభినందిస్తున్న నాయకులు

ఆశచూపి రాబట్టుకొనే అవకాశం ఆ పార్టీకి లేకుండా పోయింది. దీంతో తమకున్న బలంతో మండల పరిషత్‌లపై వైసిపి తమ పట్టు జారకుండా కాపాడుకుంది. మాకవరపాలెం, మాడుగుల, ఎస్.రాయవరం, దేవరాపల్లి ఎంపిపిలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

లులూకు హోల్ సేల్‌గా 99 ఏళ్లు

4.5 ఎకరాలను ప్రభుత్వం సిఎంఆర్‌కు కేటాయించింది. తిరిగి ఇప్పుడు విశ్వప్రియ ఫంక్షన్ హాలు వెనక భాగంలోని హార్బర్ పార్కు స్థలం 13.43 ఎకరాలను లులూకు బాబు సర్కారు ధారాదత్తం చేయడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం షాపింగ్ మాల్ ఏర్పాటు కోసం 99 ఏళ్లకు లీజుకు ఇవ్వాలి. మూడేళ్ల లేదా షాపింగ్ మాల్‌ను ప్రారంభించే తేదీ (ఏది ముందైతే దాని ఆధారంగా) అద్దె మినహాయింపు ఇవ్వాలి. ప్రతి పదేళ్లకోసారి మాత్రమే 10 శాతం చొప్పున అద్దె పెంచాలి. ఇన్ని రాయితీలు, నజరానాలు 'లులూ' సంస్థకు చంద్రబాబు కూటమి సర్కారు ఇవ్వడం అంటే దాదాపు దాసోహమైనట్టే అన్న వాదన సర్వత్రా విశాఖలో వినిపిస్తోంది.

హార్బర్ పార్కు భూములను లులూకు కట్టబెట్టొద్దు

రోజూ లక్షల సంఖ్యలో ఆర్‌కె బీచ్‌కి వెళ్ళే ప్రజల ఆహ్లాదానికి ఆటంకంగా మారుతుందన్నారు. దీనివల్ల అనేక చిన్న సంస్థలు దెబ్బతిని, అందులోనివారు ఉపాధి కోల్పోతారన్నారు. ఈ సంస్థ వల్ల వచ్చే ఉపాధి అతి తక్కువ వేతనాలతో, విచ్చలవిడి కార్మిక దోపిడీతో కూడుకుని ఉంటుందన్నారు. తీర ప్రాంత నియంత్రణా జోన్ నిబంధనలకు ఈ కేటాయంపు విరుద్ధమని పేర్కొన్నారు. అంతేగాక ఈ సంస్థకు రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల వల్ల ప్రభుత్వం ప్రతి ఏడాదీ వందల కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతుందన్నారు. 99 ఏళ్ల లీజుతో పాటు ఆస్తి బదలాయింపు, నాలా వంటి ఛార్జీల మినహాయింపు, రాష్ట్ర జిఎస్‌టి మినహాయింపు, అందులో పనిచేసే ప్రతి ఉద్యోగికీ రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.7500 పిఎఫ్ కింద చెల్లింపు వంటి వందల కోట్ల మినహాయింపులు ఇస్తున్నట్టు తెలిపారు. గతంలో హార్బర్ భూములకు ఆనుకొని ఉన్న సిఎంఆర్ సంస్థకు చెందిన 3.43 ఎకరాల భూమి విస్తీర్ణంలో ఉన్న విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్‌ను తీసుకొని లులూ సంస్థకు బదలాయించి సిఎంఆర్‌కి 1:15 ప్రాతిపదికన రూ.200 కోట్ల విలువ కలిగిన సుమారు 4.5 ఎకరాలను సీతమ్మధార, సిరిపురం, ఎంవిపిలలో కేటాయించారన్నారు. ఈ అడ్డగోలు భూ దోపిడీ ఇంతటితో ఆగదన్నారు. ఇప్పటికే ఒబెరాయ్ వంటి సంస్థలకు భీమిలి దగ్గర స్టార్ హోటళ్లు, రిసార్టుల కోసం 80 ఎకరాలకుపైగా కేటాయించారన్నారు. ఈ చర్యలు ప్రజల ప్రయోజనాలకు వినియోగించాల్సిన వాటిని బడా వ్యాపార సంస్థల లాభాలకు ధారాదత్తం చేయటమేనని జగ్గునాయుడు ఆగ్రహం వ్యక్తపరిచారు.

ఎంపిపి పదవులు పదిలం

ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాకవరపాలెం ఎంపిపిగా రుత్తల సర్వేశ్వరరావు, మాడుగుల ఎంపిపిగా తాళ్లపురెడ్డి రాజారాం, ఎస్.రాయవరం ఎంపిపిగా కేసుబోయిన వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాధారణ ఎన్నికల ముందు తన భర్త కిలపర్తి భాస్కరరావు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరడంతో దేవరాపల్లి ఎంపిపి పదవికి కిలపర్తి రాజేశ్వరి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జ్ ఎంపిపిగా కొనసాగుతున్న వైసిపికి చెందిన చింతల బుల్లిలక్ష్మి గురువారం జరిగిన ఎన్నికల్లో ఎంపిపిగా ఏకగ్రీవంగా ఎన్నికయారు. చోడవరం వైస్ ఎంపిపిగా వైసిపికి చెందిన అంబేరిపురం ఎంపిటిసి సరగడం లక్ష్మి, సబ్బవరం వైస్ ఎంపిపిగా టిడిపి నారపాడు ఎంపిటిసి మామిడి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తెలుగు నాటకాలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను ఆరు నెలల్లో రాష్ట్రానికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 2025లో నాటకాలకు, సినిమాలకు నంది అవార్డులు అందజేయనున్నామని ప్రకటించారు. అనంతరం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ నాటకాలకు పూర్వ వైభవం రావాలని కోరారు. సుమారు 60 ఏళ్ల క్రితం ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరపాలని ఆనాటి పెద్దలు నిర్ణయించారని, అలా ప్రారంభించారని గుర్తు చేశారు. నాటకం దినదినాభివృద్ధి చెందుతుందని మహాకవి శ్రీశ్రీ అన్నారని, నేడు అదే జరుగుతుందని అన్నారు. ఆనాటి ఎన్టీఆర్, ఎఎన్నార్, ఎస్వీఆర్, సావిత్రి వంటి నటులు రంగస్థలం నుండే సినిమా రంగానికి వెళ్లారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి దుర్గాప్రసాద్, సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ జిఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న ఐటమ్ నాటకం

అంతర్జాతీయ నాటక దినోత్సవాలలో భాగంగా రైటర్స్ అకాడమీ ఏర్పాటు చేసిన మొదటి నాటకం ఐటమ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గుజరాతీ నాటకం కావడంతో కొంత భాషాపరమైన ఇబ్బంది ఇక్కడి వారికి ఉన్నప్పటికీ ప్రేక్షకులు జేజేలు పలికారు.

మేయర్‌గా హరి వెంకట కుమారిని కొనసాగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి మేయర్‌గా గొలగాని హరి వెంకట కుమారిని కొనసాగించాలని యాదవ ఐక్య వేదిక జాతీయ కన్వీనర్ ఎ.అప్పలనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మేయర్ హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే మేయర్ స్థానాన్ని యాదవులకే ఇవ్వాలని కోరారు. జివిఎంసిలో 22 మంది యాదవ సామాజిక తరగతికి చెందిన కార్పొరేటర్లు ఉన్నారని చెప్పారు. మేయర్ పదవి నుంచి యాదవలను తొలగిస్తే తమ సామాజిక తరగతికి తీవ్ర అన్యాయం జరిగినట్టేనన్నారు. రాష్ట్రంలో 2024 ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గాజువాకకు చెందిన యాదవ కులానికి చెందిన పల్లా శ్రీనివాసరావు ఎన్నికయ్యారని, ఆయనకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా, ప్రాధాన్యత లేని టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవిని కట్టబెట్టి అన్యాయం చేశారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడిబోయిన బాబ్జి యాదవ్, భారత చైతన్య యువజన పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎడ్ల వేణుగోపాల్, నక్కా సాంబశివరావు పాల్గొన్నారు.

కెజిహెచ్ అభివృద్ధికి రూ.2 కోట్ల విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చే కింగ్ జార్జి ఆసుపత్రి (కెజిహెచ్)లో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకుగాను సిఎస్ఆర్ కింద ఎన్‌టిపిసి సంస్థ రూ.2 కోట్ల విరాళం ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను గురువారం ఆయన ఛాంబర్‌లో కలిసిన ఎన్‌టిపిసి సంస్థ ప్రతినిధులు సంబంధిత చెక్కును అందజేశారు. పేదలకు మరిన్ని వైద్య సదుపాయాల కల్పన, ఆధునిక వైద్య పరికరాలు కొనుగోలు, వివిధ అభివృద్ధి పనులు



కలెక్టర్‌కు విరాళ చెక్కు అందజేస్తున్న ఎన్‌టిపిసి అధికారులు

చేపట్టేందుకుగాను సంబంధిత సిఎస్ఆర్ నిధులను ఉపయోగించాలని అధికారులకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. డయాలసిస్ యంత్రాల కొనుగోలుకు, ఆపరేషన్ థియేటర్ అభివృద్ధి కోసం వినియోగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. నెఫ్రాలజీ విభాగంలో ఆరు డయాలసిస్ యూనిట్లు, భవనగర్ వార్డులో నాలుగు డయాలసిస్ యూనిట్లు నెలకొల్పేందుకు, ఆపరేషన్ థియేటర్లో వివిధ ఆధునిక పరికరాల కొనుగోలు, సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎన్‌టిపిసి సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ, ఎజిఎం (హెచ్ఆర్) బిబి.పాత్ర పాల్గొన్నారు.

తోపుడుబండ్లు, చిల్లర వర్తకులపై దాడులు ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి పరిధిలో సుమారు 50 వేల మంది తోపుడు బండ్లు, చిల్లర వర్తకంపై ఆధారపడి బతికే పేదలు ఉన్నారని, వారిపై ప్రభుత్వం దాడులకు దిగడం దారుణమని తోపుడు బండ్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకట రెడ్డి అన్నారు. వారి స్వయం ఉపాధిని దెబ్బతీసేలా ఇటీవల ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా తోపుడు బండ్లను, చిల్లర వ్యాపారాలను తొలగిస్తూ, వారిని రోడ్డు పాలు చేస్తోందని వాపోయారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహకారం లేక కుటుంబాలను పోషించుకోవడానికి తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలను మార్గంగా పలువురు పేదలు ఎంచుకున్నారన్నారు. పోరాటాల ఫలితంగా వీధి విక్రయదారుల రక్షణ చట్టం 2014ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. సుప్రీం కోర్టు కూడా రోడ్డు పక్కన బతికే వీధి విక్రయదారులకు ఉపాధి రక్షణ కల్పించాలని మార్గనిర్దేశకాలు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ విశాఖ నగరంలో తోపుడుబండ్ల కార్మికులు జివిఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ లాంటి వారి వేధింపులతో భయం భయంగా బతుకుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే జివిఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో విశాఖపట్నం తోపుడుబండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంగుడు సింహాచలం, మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు పి.వెంకటరావు, సిఎంఆర్ సెంట్రల్ ఏరియా నాయకులు చిన్ని, సిఐటియు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నోటీసు
విజయనగరం ప్రిన్సిపాల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జివారి కోర్టులో
IA 324/2024 in OS 48/2018

నలజాన పరమేశ్వరి ......పిటిషనరు/వాది
నలజాన శంకరరావు (Died) వగైరాలు
....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To
R13. నలజాన శ్రీకాంత్ S/o లేటు జగన్నాధరావు, అసిస్టెంటు మేనేజరు, S.H.P.L.Company, Sahuwala High Pressure Cylinders (P) Ltd, G.బ్లాక్, ఆటోనగర్, విశాఖపట్నం - 530012.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన నలజాన జగన్నాధరావు గారి మరణానంతరం వారి వారసులను చేర్చగలందులకు అయిన ఆలస్యమును నివృత్తి చేయగలందులకు పై నెంబరు పిటిషను దాఖలు చేయగా అందులో మీకు గల ఆక్షేపణలు ఉన్న యెడల **తే 4-4-2025దిని పగలు గం॥10-30 ని॥**లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయముగా కాని, వకీలు ద్వారాగాని హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలు దాఖలు చేసుకోగలందులకు కోరడమయినది. లేని యెడల సదరు విషయము మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయడమైనది. కాగా యిది పై కోర్టువారి ఆర్డరు ప్రకారం ప్రకటించడమైనది.

శ్రీ పోతుల రాంబాబు
పిటిషనరు త॥ న్యాయవాది,
విజయనగరం.

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉగాది, రంజాన్ పండగలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 శాతం డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు ఆప్కో విజయనగరం మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాదరావు గురువారం తెలిపారు. విశాఖపట్నం జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయ శాలల్లో అనగా జగదాంబ, విఎంఆర్‌డిఎ, రాంనగర్, ఉడా సిరిపురం, విశాఖపట్నం ఎయిర్ పోర్ట్, ఉక్కునగరం, గోపాలపట్నం, సింహాచలం ఏరియాల్లోగల అప్కో విక్రయ శాలలలో పై ఆఫర్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరూ ఆప్కో విక్రయ శాలలను సందర్శించి వారికి కావలసిన రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, రెడీమేడ్ షర్ట్స్, డ్రెస్ మెటీరియల్స్ మొదలగు చేనేత వస్త్రాలను కొనుగోలుచేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్యం వెంటనే ఆపాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల నుండి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం అకారణంగా తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ఓ పక్క స్టీల్ ప్లాంట్‌ను అన్ని విధాల ఆదుకుంటామని, పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కూటమి ప్రభుత్వం చెబుతూనే మరోపక్క కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు ప్లాంట్ ఉత్పత్తిలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తున్నారన్నారు.

పబ్లిక్ నోటీస్
ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్.,
(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధసంస్థ)
రి.నెం., ABC-CS/006/2015

HO : ABCCS Endowments CommissionerateComplex, Gollapudi, Vijayawada-521225, Phone: 0866-6650307.
BO: ABC-CS, Flat No.F1, HSR Enclave,Opp Andhra Bank, Akkayyapalem, Visakhapatnam-530016, Ph:0891-2561655.

ఈ ప్రకటనలోని వారి తాలుకు దిగువ ఉదహరించిన స్థిరాస్థిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖాపై, సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్నఎడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వకముగా అభ్యంతరములను రిజిష్టరు పోస్టు విత్ ఎక్నాలెడ్జ్‌మెంట్ ద్వారా మా సొసైటీకు తెలియపరచవలసినదిగా కోరుతున్నాము.

Sl. No.	Applicant Name & Present Residence Address	Description of the property
1	Sri.BUKKAPATNAM. SRINIVAS. G.No:82608. S/o.late.Bukkapatnam R Ramanujachari. Cell : 8885148899 and 7207350007.	The property in an extent of undevided and unspecified share of 33.sq.Yards. (an extent of 28.sq.yds in s.no.45/1,2 of marripalem village and 5.sq.yds. in s.no.46/2 of madhavadhara village)out of total 885.66.sq.yds. with a plinth area of 950.s.ft.(including common areas and balconies) and Car Parking 80 S.ft.of Two bed room residential flat the rein,Survey.No.s. 45/1, 2 & 46/2, Plot.No:104,TD NO:1263, Empire Plaza, Flat.No.205, First Floor, Door No: 39.08.55/10, Revenue ward no.49,Asst no. 1086587922, HP Gas line, Murali Nagar, Near Skating Park, MADHAVADHARA(V),GVMC Limits, Visakha patnam District. 530007. Value Rs. 39.43. lakhs.

Visakhapatnam
Dt.26-03-2025
Branch Manager,
SRINIVASA RAO TATA 9281029463/9848141269

గ్రామ పంచాయతీ కార్యాలయం-కొత్తకోట

రేఖా నెం.01/2025 **టెండరు నోటీసు** **తేదీ.27/05/2025**

అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట గ్రామ పంచాయతీలో 2025-26 ఆర్థిక సంవత్సరమునకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల వరుస నెంబరు నందుగల టెండరు 28-03-2025ది శనివారం ఉదయం గం.10:00 నుండి 1.00 గం॥ల వరకు టెండర్లు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం గం॥ 2:00లకు టెండర్లు తెలుపబడి సాయంత్రం గం॥ 5:00లకు టెండరు కరారు చేయబడును. సదరు టెండరు యిదిగువ సంతకందరునిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు నిర్వహించబడును.

వ. నెం.	పని వివరములు	చెల్లించవలసిని ధరావత్తు
1	కొత్తకోట గ్రామపంచాయతీ 2025-26 సం॥ పారిశుద్ధ్య పని చేయుటకు సిబ్బంది సప్లై చేయుటకు మంచి నీటి సరఫరా చేయుటకు సిబ్బందిని సప్లై చేయుటకు మరియు వీధిలైట్లు నిర్వాహణ చేయుటకు	రూ.2000/-
2	అదే రోజు ఉదయం గం॥ 11:00లకు కొత్తకోట పంచాయితీకి సంబంధించిన పాత ఇనుప సామాగ్రీ వేలం పాట వేయబడును అందుకు ధరఖాస్తు ధరావత్తు	రూ.1500/-

సం/- జి.జ్యోతిష్వర్‌రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి (ఇ.ఓ)
కొత్తకోట గ్రామ పంచాయతీ, రావికమతం మండలం

ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్‌తో అమెరికాలో అధ్యయనం

ప్రజాశక్తి-మధురవాడ : భారతీయ విద్యార్థులకు, పరిశోధకులకు, వృత్తినిపుణులకు అమెరికాలోని విద్యా సంస్థల్లో అధ్యయనం చేయడానికి అవసరమైన నిధులను అందించి ప్రోత్సహించడంలో యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (యుఎస్ఐఇఎఫ్) గత 75 సంవత్సరాలుగా కృషి చేస్తోందని యుఎస్ఐఇఎఫ్ ప్రాంతీయ అధికారి మాయా సుందర రాజన్ తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన వెబినార్‌లో ఆమె వివరాలను వెల్లడించారు. ఏటా ఫిబ్రవరి నెలలో ఇందుకు సంబంధించిన ప్రకటన జారీ చేస్తామని, దరఖాస్తు గడువు మే నెల నుంచి జులై మధ్య తేదీలలో ఉంటుందని తెలిపారు. యుఎస్ఐఇఎఫ్ ద్వారా ఫుల్‌బ్రైట్ నెహ్రూ మాస్టర్స్ ఫెలోషిప్, ఫుల్‌బ్రైట్ నెహ్రూ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోషిప్, ఫుల్‌బ్రైట్ నెహ్రూ పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోషిప్ లను అందిస్తున్నామని వెల్లడించారు. ఆంగ్ల భాషా ప్రావీణ్యంతో పాటు తాము అధ్యయనం చేయాలనుకునే సబ్జెక్టుల్లో లోతైన పరిజ్ఞానం, సామాజిక ప్రయోజనాలు, వ్యక్తిగత ప్రతిభను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ మాధ్యమాలు అందుబాటులోకి వచ్చి దేశాల మధ్య దూరం తగ్గిపోయిన నేపథ్యంలో అమెరికాలోని విద్యాలయాలకు వెళ్లి ఎందుకు అధ్యయనం చేయదలిచారో సరైన అవగాహనతో సమాధానం తెలపాల్సి ఉంటుందన్నారు. ప్రతిభ ఆధారంగా భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులను ఎంపిక చేసి అమెరికాలోని వారు ఎంపిక చేసుకున్న విద్యా సంస్థల్లో అధ్యయనం చేయడానికి అవసరమైన వ్యయాన్ని ఫెలోషిప్ రూపంలో అందిస్తామని తెలిపారు. పూర్తి సమాచారం కోసం యుఎస్ఐఇఎఫ్ వెబ్ సైట్‌ను పరిశీలించాలని సూచించారు. ఈ ఫెలోషిప్‌లను పొందడానికి ఏవిధమైన వయోపరిమితి లేదని తెలిపారు. గీతం ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్ గ్రహీత ప్రొఫెసర్ బి.నళిని మాట్లాడుతూ, తన కెరీర్‌లో ఫుల్‌బ్రైట్ ఫెలోషిప్ చక్కటి ప్రభావాన్ని చూపించిందని తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నాటకరంగం వెలవెల

ప్రజాశక్తి-మధురవాడ : ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నాటక రంగం నేడు వెలవెలబోతోందని చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రవి పేర్కొన్నారు. పాఠశాలలో గురువారం రంగస్థలం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాటకాన్ని ఇష్టపడేవారు ఇప్పటికీ ఎంతో మంది ఉన్నారని, నాటకం ద్వారా నేర్చుకున్న పాఠాలే ఎందరో కళాకారులను వెండితెరపై స్టార్లను చేసిందని చెప్పారు. దేశ స్వాతంత్ర పోరాటంలో కూడా నాటక కళ చాలా ఎక్కువ పాత్ర కలిగి ఉందని తెలిపారు. పాఠశాల బోధనలో కూడా నాటికీకరణ, డ్రామాలు గొప్ప ప్రక్రియలని, ఉపాధ్యాయులు కూడా వీటిలో ప్రావీణ్యం సాధించాలని కోరారు. నాటకాల ద్వారా దేశభక్తి సందేశాలు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులు పలు స్కిట్స్, నాటికలు ప్రదర్శించారు.

ఆస్తి పన్ను విధానాన్ని సమీక్షించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఎన్నికల ముందు కూటమి పార్టీలు హామీ ఇచ్చిన విధంగా ఆస్తి పన్ను విధానాన్ని సమీక్షించాలని నర్సీపట్నం ట్యాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు త్రిమూర్తులురెడ్డి, శివనారాయణరాజు, జోగి నాయుడు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ అధికారులను, కౌన్సిలర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల నుండి సంవత్సరానికి ఏటా 15 శాతం చొప్పున ఇప్పటికే 100శాతం పన్నులు పెంచినందున ఏప్రిల్ నుండి ఆస్తి పన్ను పెంచరాదనిప్రభుత్వాన్ని కోరారు. 100శాతం వడ్డీ రద్దు చేయాలని, మే నెలాఖరు వరకు పన్నులు చెల్లించే అవకాశం కల్పించాలని, 24 శాతం వడ్డీ విధానాన్ని సమీక్ష చేయాలని ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా 24 శాతం వడ్డీ వసూలు చేయడం సమంజసం కాదనివేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 46లో మార్పులు చేయాలనికోరారు. ఇప్పటికే వడ్డీ చెల్లించిన వారికి రాబోయే సంవత్సరంలో పన్ను చెల్లింపులో పూర్తిగా దాన్ని మినహాయించాలన్నారు.

మహిళా మార్ట్ సందర్శన

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న మహిళా మార్ట్‌ను గురువారం అడిషనల్ సిఇఒ శ్రీరాములునాయుడు సందర్శించారు. మహిళా మార్ట్‌లో ఉన్న నిత్యవసర సరుకుల ధరలను పరిశీలించారు. మహిళా సంఘ సభ్యులతోపాటు ప్రైవేటు వ్యక్తుల నుండి కూడా వ్యాపారం రావాలని సిబ్బందికి సూచించారు. ప్రయివేటు మార్ట్‌ల కంటే మహిళా మార్ట్‌లో తక్కువ ధరలు ఉన్నప్పుడే సేల్స్ పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిఒ లక్ష్మీపతి, ఎపిఎం సాయిరమేష్, సురేష్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మద్ది సత్తమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామానికి చెందిన కంటుబోతు ఇలవేల్పు సత్తమ్మ తల్లి పండుగను గురువారం ఆ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. ఆనవాయితీ ప్రకారం ఆ కుటుంబానికి చెందిన ఆడపిల్లలు మాత్రమే అమ్మవారికి మొక్కిన ప్రతిఫలాలను భుజించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీను, కె.శ్రీను, కె.గోవింద, బి.సత్యనారాయణ, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్ల దినోత్సవం

శకటాలతో ఊరేగింపుగా బయలుదేరిన కార్పెంటర్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ కార్పెంటర్స్, వడ్రంగి అసోసియేషన్ ఆధ్వర్యాన కార్పెంటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చినగదిలి మండలం ఆరిలోవ కాలనీ నుంచి జగదాంబ లేపాక్షి సర్కిల్ వరకు ఆటోలు, బైక్‌లతో స్థానిక కార్పెంటర్లు, వడ్రంగులు పడుతున్న బాధలను తెలియజేస్తూ పనిముట్లను కర్రతో నమూనాగా తయారు చేసి ఆటోలో ఊరేగిస్తూ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం వడ్రంగి వృత్తి కార్మికుల యోగ క్షేమాలు తెలుసుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కష్ట జీవులైన తమకు వయోపరిమితిని సడలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వేముల కన్నాప్రసాద్, బేతా సన్యాసిరావు, పూడి సురేష్, చిట్టూరి కృష్ణ, తవిరి శ్రీనివాస్, గోవిందు, రాజేష్, శివాజీ, హరిబాబు, బ్రహ్మజీ పాల్గొన్నారు.

వ్యవసాయ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం మహిళా సమాఖ్య భవనంలో జిల్లా వ్యవసాయ శాఖ, సెర్ప్, ప్రకృతి వ్యవసాయ విభాగాల సహకారంతో రానున్న ఖరీఫ్ కాలానికి సంబంధించి యాక్షన్ ప్లాన్‌పై కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.మోహనరావు మాట్లాడుతూ, రానున్న ఖరీఫ్ సీజన్ కోసం రైతు వారీగా యాక్షన్ ప్లాన్‌ను ఎలా తయారు చేయాలి, దాని అమలు ప్రక్రియపై చర్చించారు. ముఖ్యంగా పిఎండిఎస్ ద్వారా నవధాన్యాలు పంటలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఎడిఎ విజయ్‌ప్రసాద్ ప్రకృతి వ్యవసాయం ఎందుకు చేయాల్లో వివరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద కంపోస్ట్ పిట్లు, కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేయడంపై దిశా నిర్దేశించారు. రైతులు ఏక పంట విధానంతో కాకుండా, బహుళ పంట విధానాలను అనుసరించాలని సూచించారు. ఎఫ్‌పిఒ, ఎఫ్‌పిజిల ఏర్పాటు ద్వారా రైతులకు కలిగే లాభాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా రైతులకు తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి మాట్లాడుతూ, నవధాన్యాలు, ప్రకృతి వ్యవసాయంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ పరికరాలు అందజేత

వ్యాయామ పరికరాలను ప్రారంభిస్తున్న డివిజన్ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్.రావు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి బోయివీధిలో వ్యాయామశాలకు అవసరమైన పరికరాలను చిప్పాడ దివీస్ సంస్థ గురువారం అందజేసింది. సంస్థ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్.రావు రూ.3 లక్షల వ్యాయామ పరికరాలను యువకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాయామం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. మత్స్యకార నాయకులు గంటా నూకరాజు మాట్లాడుతూ, తాము అడిగిన వెంటనే దివీస్ సంస్థ వ్యాయామ పరికరాలను అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కె.నాగరాజు, కె.దుర్గారావు, కాశీరావు, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధి శేఖర్‌బాబు పాల్గొన్నారు. తొలుత వ్యాయామ పరికరాలను ప్రారంభించారు.

11న బహిరంగ సభను జయప్రదంచేయాలి

ప్రజాశక్తి -తగరపువలస : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యాన ఏప్రిల్ 11న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడి రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సభలో పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారని తెలిపారు. స్థానిక జిఆర్.భవన్‌లో గురువారం జరిగిన పార్టీ ఏరియా సమితి మహాసభలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిములు, క్రైస్తవులు లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నట్లు ధ్వజమెత్తారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 10, 11 తేదీల్లో విశాఖలో నిర్వహించే సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. మాజీ కౌన్సిలర్ మావూరి సన్యాసమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ ఏరియా సమితి కార్యదర్శిగా కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శిగా మోర అప్పలరాజు, సభ్యులుగా ఎరుసు అప్పలనరసయ్య, నూలు ఆదినారాయణ, అల్లం గోవింద్, పల్లా లక్ష్మణరావు, మదాబత్తుల రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి పైడిరాజు తెలిపారు. పార్టీ నాయకులు కొండపు ఈశ్వరరావు, సిహెచ్ రాం పైడి, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఏటిఎం కార్డు మార్పు కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం కృష్ణాబజారు ఎస్‌బిఐ ఏటిఎం వద్ద ఒక యువతికి ఏటిఎం కార్డు మార్చి ఈ ఏడాది ఫిబ్రవరి 10న రూ.30వేలు విత్ డ్రా చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు నర్సీపట్నం డిఎస్‌పి పి.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తునకు ఎస్‌పి ఆదేశాలతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. రాజమండ్రి కొత్తపేటకు చెందిన ఇల్లపు వెంకటసాయికిరణ్ అనే నిందితుడిని అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడిపై మొత్తం 14 కేసులు ఉన్నాయన్నారు. ఒక నెల రోజుల పాటు ప్రత్యేక టీమ్ ఎంతో కష్టపడి నిందితుడిని అరెస్టు చేసిందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి చైతన్య, టౌన్ ఎస్సై గోవిందరావు, టౌన్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం-గోవాడ రోడ్లో గురువారం ఉదయం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మండలంలోని అంబేరుపురం గ్రామానికి చెందిన బి.పైడ్రాజు తీవ్రంగా గాయపడ్డాడు. పైడిరాజు రోడ్డుపై నడుచుకుంటూ వెళుండగా గుర్తుతెలియని వాహనం ఆయన్ను ఢీకొట్టి వెళ్లిపోయింది. రోడ్డుపై పడి ఉండడాన్ని అటుగా వెళుతున్న మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు చూసి 108 వాహనానికి ఫోన్ చేసి దగ్గరుండి క్షతగాత్రున్ని అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు.

రూ.500 ఇవ్వలేదని ఆత్మహత్యకు యత్నం

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో భర్త మీద అలిగిన ఓ మహిళ గురువారం ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఘటనకు సంబంధించి సిఐ కథనం ప్రకారం... కొమ్మాది రాజీవ్ గృహకల్పలోని బ్లాక్ నెంబర్ 24 టిఎఫ్1లో అనంతరాయుడు, సూరీడమ్మ దంపతులు నివసిస్తున్నారు. రూ. 500 ఇవ్వాలని భర్తను సూరీడమ్మ అడిగారు. భర్త నిరాకరించారు. దీంతో సూరీడమ్మ వారు నివసిస్తున్న నాలుగో అంతస్తు కిటికీపై ఉన్న సన్‌సేడ్ పైకి ఎక్కి అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. వెంటనే స్థానికులు పిఎం.పాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ భాస్కర్ తన సిబ్బందితో వెళ్లి ఆమెతో మాట్లాడి పైకి రప్పించారు. కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు సిఐ తెలిపారు.



పైకి రప్పించే ప్రయత్నం చేస్తున్న పోలీసులు

శంకుస్థాపనలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్, నరవవానిపాలెం, పులగానిపాలెం, దుర్గా నగర్ ప్రాంతాలలో రూ.2.25 కోట్లు జివిఎంసి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని 9 వార్డుల్లో తక్కువ కాలంలోనే సుమారు రూ.64 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రూరల్ ప్రాంతంలో మరో రూ.60 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, జోనల్ కమిషనర్ హైమావతి, కూటమి నాయకులు ఆర్ఎస్.నాయుడు, గొర్లె అప్పారావు, అవగడ్డ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిట్టివలస అగ్నిమాపక సిబ్బందికి జోన్-1 రీజనల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి అవగాహన కల్పించారు. చిట్టివలస అగ్నిమాపక కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. ఫైర్ ఆఫీసర్ జి శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్‌ను ఆవిష్కరిస్తున్న సీతారామయ్యచౌదరి

రాయల్ ఎన్‌ఫీల్డ్ 650 బైక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 650 నూతన బైక్‌ను దొండపర్తిలోని షోరూమ్‌లో సంస్థ ఎమ్‌డి జివివి.సీతారామయ్యచౌదరి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు దూసుకుపోతుందన్నారు. ఇటువంటి తరుణంలో 650 క్లాసిక్ బైక్‌ను ఆవిష్కరించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఇప్పటికే ఐదు మంది అడ్వాన్స్‌గా బుక్ చేసుకున్నారని తెలిపారు. నూతన ఫ్యూచర్స్ ఉన్నాయని పేర్కొన్నారు. తమ బ్రాంచిలో బైక్‌ను కొనుగోలు చేసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జి.నరేంద్రచౌదరి, దొండపర్తి సేల్స్ మేనేజర్ జె.కల్యాణ్, దీపక్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు

ప్రజాశక్తి- గోపాలపట్నం : సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేడీ ఫౌండేషన్ నిధులతో ఇంకుడు గుంతను నిర్మించారు. పాఠశాలలో విద్యార్థులకు వాటి ఉపయోగం, సంరక్షణ విధానాన్ని తెలిపి నిర్వహణ బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బేగం మాట్లాడుతూ, 2030వ సంవత్సరం నాటికి భారతదేశంలోని పల్లెలు, పట్టణాల్లో 40 శాతం తాగునీరు దొరకడం కష్టమని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.బాబూరావు, ఆర్.నాగేంద్ర జోగి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెం గణేష్ సాయి నగర్‌లో జివిఎంసి నిధులతో నిర్మించిన సిసి రోడ్లు, కాలువలను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్థానిక కార్పొరేటర్ దాడి వెంకట రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో రహదారుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో సైతం సిసి రోడ్లు కాలువలు నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 89 వార్డు టిడిపి అధ్యక్షుడు బొడ్డేటి విజయ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పంచకర్ల

ప్రజాశక్తి-పెందుర్తి : చినముషిడివాడ మస్జీద్ ఏ నూరాని కమిటీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు హాజరయ్యారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జివిఎంసి ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు పండగ విశేషాలను మత పెద్దల ద్వారా తెలుసుకొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిముల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి మస్జిద్ ప్రెసిడెంట్ షేక్‌బృహాన్ తీసుకెళ్లారు. పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సేనాపతి శంకరరావు, సోమశేఖర్‌నాయుడు, షేక్ నాగూర్, షేక్ రెహ్మాన్ పాల్గొన్నారు.

28, 29న అనిట్స్‌లో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో 'డిజైన్ ఇన్నోవేషన్స్ అండ్ ఎనర్జీ సిస్టం ఆప్టిమైజేషన్ ఫర్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్' అంశంపై ఈ నెల 28, 29 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీరామకృష్ణ తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు అధ్యక్షతన జరుగు సదస్సుకు ముఖ్య అతిథిగా మచిలీపట్నం కృష్ణ యూనివర్సిటీ విసి కె.రాంజీ హాజరుకానున్నారని తెలిపారు.

రూ.35 వేలు కట్టించుకున్నారు... ఇళ్లు రాలేదు..

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ఆంధ్ర స్టీల్ కాలనీ, 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో గురువారం సిపిఎం ప్రజా చైతన్య యాత్ర సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో కరెంటు చార్జీలు గతం కంటే పెరిగాయని, గత వైసిపి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల కోసం రూ.35 వేలు కట్టామని, ఆ ఇల్లు రాలేదని స్థానికులు సిపిఎం నాయకుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. రూ.35 వేలను కూటమి ప్రభుత్వం ఇస్తుందా, లేక ఇల్లు అందిస్తారా అన్నది ఇంతవరకు స్పష్టత లేదని తెలిపారు. టిడ్కో ఇళ్ల గురించి ప్రస్తావనే లేదని, ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నామని ప్రజలు తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్ డబ్బులు పడలేదని, ఇల్లు పట్టాలు, రిజిస్ట్రేషన్, ఇంటి పన్నుల పేర్లు మార్పు తదితర పలు సమస్యలను స్థానికులు వివరించారు. ఈ సర్వేలో ఆంధ్ర స్టీల్ కాలనీలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు అన్నం సత్యారావు, ఎస్.ప్రసాద్, బిఎస్ఎన్.రాజు, రమణ, కోటేశ్వరరావు, గుడివాడ అప్పన్న కాలనీలో సిపిఎం నాయకులు పి.రామారావు, బి.అర్జునరావు, సింహాద్రి అప్పడు, పి.సురేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

40, 62 వార్డుల్లో సిపిఎం సర్వేలో ప్రజల ఆవేదన

ఆంధ్ర స్టీల్ కాలనీ, గుడివాడ అప్పన్న కాలనీలో సర్వే చేస్తున్న సిపిఎం నాయకులు

సుబ్బారావుకు ఘన నివాళులర్పించాలి

కార్మికులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-మాధవధార : కీర్తిశేషులు గొల్లపల్లి సుబ్బారావు 2వ వర్ధంతి సభ శీలానగర్‌లోని వారి నివాసంలో జరుగుతుందని, దీనికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ఘన నివాళులర్పించాలని సిఐటియు నాయకులు సనపల శ్రావణ్ కుమార్ కోరారు. జివిఎంసి జోన్ -5 పరిధిలోని 49, 50, 51, 52 వార్డుల పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ, పారిశుధ్యం, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్స్, యుజిడి, వెటర్నరీ, పార్కు, మలేరియా తదితర విభాగాల కార్మికులు రావాలని పిలుపునిచ్చారు. అన్ని వార్డు మస్టర్ ఆఫీసుల వద్ద ఉదయం సుబ్బారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించాలన్నారు. ఏప్రిల్ 2వ తేదీన రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుండి 10.30 గంటలకు నిర్వహించే ర్యాలీలో అందరూ పాల్గొనాలని కోరారు. ముఖ్యంగా అప్కాస్ రద్దు చేసి సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చెయాలని ఆ రోజు సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పాపారావు, దేవి, లక్ష్మి, బాలరాజు, బంగారయ్య, ధన, అప్పలరాజు, రమణ, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

30న ఉగాది సంబరాలు

ప్రజాశక్తి -మాధవదార : బొట్ట నరసింగరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 30వ తేదీన ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కవితాగోష్టితోపాటు పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందివ్వనున్నట్లు తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. వివరాలకు 94411 06504 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వైసిపి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షునిగా వెంకటరమణ

ప్రజాశక్తి -మాధవధార : వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.వెంకటరమణ నియమితులయ్యారు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో 51వ వార్డు నుండి పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలుపొందారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

మీటర్ రీడర్ల ధర్నా

ప్రజాశక్తి-సీతమ్మధార : సమస్యలపై విద్యుత్ మీటర్ రీడర్లు గురువారం ఎపిఇపిడిసిఎల్ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి సమ్మె చేస్తామని చెబుతూ డిమాండ్లతో కూడిన వినతిని సిఎమ్‌డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకాశి, జిఎస్‌జె.అచ్యుతరావు, రామకృష్ణ, శివారెడ్డి, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'చిన్మయ మిషన్ సేవలు మరువలేనివి'

ప్రజాశక్తి -గాజువాక : చిన్మయ మిషన్ సేవలు మరువలేనివని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యాన దువ్వాడ సమీపం గొల్లలపాలెంలో నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా ఆధ్యాత్మికతో పాటు, అనేక సేవా కార్యక్రమాలను చిన్మయ మిషన్ చేపట్టినట్లు తెలిపారు. డైనమిక్స్ లిమిటెడ్, హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, పరమేష్ బయోటెక్, మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్, బ్రైత్‌వైట్ అండ్ కో లిమిటెడ్, సరోవర్ హోటల్స్ సహకారంతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్‌యార్డు సిఎమ్‌డి హేమంత్ బద్రి, భారత డైనమిక్ లిమిటెడ్ సిఎమ్‌డి మాధవరావు, సర్దార్ ప్రాజెక్ట్ లిమిటెడ్ ఎమ్‌డి యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

1న మహాధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం ఉదయం 10 గంటలకు జరిగే మహాధర్నాలో ఉక్కు కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 1505వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో రోలింగ్ మిల్స్ విభాగాలకు చెందిన ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ, ఉక్కు కర్మాగారాన్ని పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని కార్మిక సంఘాలు పోరాడుతుంటే, కేంద్ర ప్రభుత్వం ఉక్కును నూటికి నూరు శాతం అమ్మాలనే సంకల్పంతో ముందుకు వెళ్తోందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు కట్ట బెట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారన్నారు. ఈ దీక్షల్లో నాయకులు కె.రాజబాబు, డి.దేముడు, జి.ఆనంద్, సుబ్రమణ్యం, కె.రాంబాబు, అమ్మోరు, రమణ, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి అగనంపూడి పశువుల ఆసుపత్రి పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య ఆధ్వర్యాన పశువులకు గురువారం గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ నెల 31వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌గా ఈ కార్యక్రమం ఉంటుందని డాక్టర్ లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా జీవితాలు నాశనం

ప్రజాశక్తి- ఆనందపురం: ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా యువత తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆనందపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింత వాసునాయుడు తెలిపారు. బెట్టింగ్ అంటే జూదమేనని, బెట్టింగ్‌లో లక్షలాది రూపాయలు కోల్పోయి అనేకమంది యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. క్యాసినో, ఆన్‌లైన్ గేమింగ్‌లు సమాజంలో యువతరాన్ని పెడతోవ పట్టిస్తున్నాయని తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశతో బెట్టింగులకు పాల్పడుతుంటారని, తల్లిదండ్రులందరూ పిల్లలు మొబైల్‌ను ఏ విధంగా వాడుతున్నారో పరిశీలిస్తుండాలని సూచించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-పద్మనాభం : 11 కేవీ గోస్తని ఫీడరుపై ఆర్‌డిఎస్ ఎస్ ప్రాజెక్ట్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. కృష్ణాపురం పంచాయతీలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లపై నిరసన

దేవరాపల్లి విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

రాష్ట్రంలో ట్రూ అప్ ఛార్జీలు పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు బిగింపును వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన దేవరాపల్లి ఎలక్ట్రికల్ ఆఫీసు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఎలక్ట్రికల్ ఎఇ కర్రి శంకరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు చేయగా, రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంపునకు ఇఆర్‌సి అనుమతి ఇచ్చిందని, 2024-25 సంవత్సరానికి రూ.9,412 కోట్ల ఇంధన సర్దుబాటు ఛార్జీలను వసూలు చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. యూనిట్‌కు 92 పైసల చొప్పున వసూలు చేయాలని నిర్ణయించిందని, దీని వల్ల ప్రజలపై రూ.7,912 కోట్లు భారం మోపనుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టిడిపి కూటమి నేతలు, నేడు అధికారంలోకి వచ్చి అవే స్మార్ట్ మీటర్ల బిగింపును వేగవంతం చేసిందని పేర్కొన్నారు. ఒక్కో మీటర్‌కు రూ.15వేలు నుండి రూ.30వేలు వరకు అదాని కంపెనీకి చెల్లిస్తోందని, ఈ మొత్తం వినియోగదారుల నుండి వాయిదా పద్ధతిలో వసూలు చేయనుందని తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల రానున్న రోజుల్లో సెల్‌ఫోన్లు, టివి డిస్‌ల వలే రీఛార్జి చేసుకోవాలని, రీఛార్జి చేయకుంటే వెంటనే కరెంట్ కట్ అయిపోతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పైడితల్లి, సన్యాసి, సోములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజలకు విద్యుత్ షాక్' పుస్తకావిష్కరణ

అచ్యుతాపురం : రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలపై ముద్రించిన 'ప్రజలకు విద్యుత్ షాక్' పుస్తకాన్ని గురువారం అచ్యుతాపురంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము సీనియర్ నాయకులు కర్రి అప్పారావు మాట్లాడుతూ కరెంట్ చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల్లో టిడిపి కూటమి నేతలు హామీ ఇచ్చి నేడు స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపడం దారుణమన్నారు. వీటికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలందరూ భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.సోమునాయుడు, రాజు, చండి, కార్మికులు పాల్గొన్నారు.

మోహనరావును అభినందిస్తున్న దృశ్యం

మోహనరావుకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ విశేష సేవలందించిన డిఆర్.మోహనరావుకు సబ్ ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా సత్కరించారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్ఐ వెంకన్న తదితరులు మోహనరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

29న శ్రీగాయత్రి పాఠశాలలో కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీగాయత్రి పాఠశాలలో విశాఖ కిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో ఈ నెల 29న ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు యాజమాన్య ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, తాళ్లపాలెం పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా ఉచితంగా షుగర్, బిపి టెస్టులు చేస్తారన్నారు. 29న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని, ముందస్తు అపాయింట్మెంట్ కొరకు 8712017158, 9177710702 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ఐజిసిఎల్ ఆధ్వర్యాన వాహనాల వితరణ

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలో ఉన్న ఐజిసిఎల్ కంపెనీ యాజమాన్యం యలమంచిలి మున్సిపాలిటీకీ, పోలీసు శాఖకు వాహనాలను అందజేసింది. ఐజిసిఎల్ వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు అందజేశారు. యలమంచిలి మున్సిపాలిటీలో చెత్త తరలించడానికి రూ.29 లక్షల విలువైన కంపాక్టర్ వాహనాన్ని (7 క్యూబిక్ మీటర్ కెపాసిటీ) మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారికి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేతులమీదుగా అందజేశారు. అలాగే రూ.39 లక్షలతో పోలీసు శాఖకు ఉపయోగపడే నాలుగు బలోరా జీపులను పరవాడ డిఎస్‌పి విష్ణుస్వరూప్‌కు అందించారు. మున్సిపల్ కమిషనర్, ఐజిసిఎల్ కంపెనీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

జాతరకు నూకాంబిక దేవస్థానం సిద్ధం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం శ్రీనూకాంబిక అమ్మవారి పండగను రాష్ట్ర పండగ ప్రభుత్వ ప్రకటన చేయడంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జాతర, కొత్త అమావాస్య పండుగ, ఉగాది మహోత్సవాలు భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను ఈనెల 28 నుండి వచ్చేనెల 27 వరకు నెలరోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. క్యూ లైన్లు, చలవ పందిరిలు ఏర్పాటు చేశామని, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు పాలు సరఫరా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. భారీ విద్యుత్ అలంకరణ, స్టేజ్ ప్రోగ్రాములు, నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో కొండకర్ల, చోడపల్లి శివారు సరిహద్దుల్లో అక్రమంగా చేస్తున్న గ్రావెల్ తవ్వకాలను అరికట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆయా ప్రాంతాలను సిపిఎం నేతలు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, బుద్ద రంగారావు, కె.సోము నాయుడు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలని, జగన్నాధపురంలో జిల్లా కలెక్టర్ పర్యటనలు చేస్తున్నారని, మండలంలో అక్రమంగా పచ్చని చెట్లను కొండలను, వాగులను జెసిబిలతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. అక్రమాలకు పాల్పడుతున్న మట్టి దొంగలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని పర్యావరణాన్ని, ప్రజల్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌వేర్‌లో రాణించొచ్చు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంజనీరింగ్ చదువుతున్న అన్ని బ్రాంచీల విద్యార్థి సాఫ్ట్వేర్ రంగంలో రాణించవచ్చని ఇన్ఫోసిస్ డేటా సెంటర్ హెడ్ నల్లా సురేష్ అన్నారు. స్థానిక దైట్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎఐ అప్లికేషన్స్ ఇన్ ఎలక్ట్రికల్ సైన్సెస్-2025 ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లా సురేష్ మాట్లాడుతూ సుమారు 90శాతం యువ సాంకేతిక నిపుణులకు సాఫ్ట్వేర్ ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఇంజనీరింగ్ లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలని సాంకేతిక రంగంలోని సమస్యలకు తమ విషయ పరిజ్ఞానాన్ని సృజనాత్మకతను ఉపయోగించి పరిష్కారాలను కనుగొనాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ గోపాలమ్మ, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కన్వీనర్ డాక్టర్ రమణ, కుమార్ జోగ, డీన్ అకాడమిక్స్ కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించేందుకు సాధికార సారథులు

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించేందుకు సాధికార సారథులను ప్రతి 60 కుటుంబాలకు ఇద్దరు చొప్పున నియమిస్తున్నట్లు పెందుర్తి టిడిపి ఇన్చార్జి, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి అన్నారు. మండలంలోని ఇరువాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన నియోజకవర్గ టీడీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30 నాటి కల్లా టిడిపి గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వాలు 40 వేలకు పైగా నమోదు చేశారని, వారికి గుర్తింపు కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి వంశీదీప్, బర్నికాన సాయినాథరావు, రెడ్డి నారాయణరావు, గండి ముత్యాల నాయుడు, గండి దేముడు, రొంగలి దేముడుబాబు, గవర అప్పారావు, దొడ్డి సూర్య ప్రకాశరావు, కొరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, రేసుపూడి రమణ, పడాల వెంకటరమణ, ఆకుల గణేష్, పలువురు సర్పంచ్‌లు ఎంపిటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బోదువలస గ్రామంలో విశాఖ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, అనకాపల్లి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశువైద్య అధికారి డాక్టర్ ఎస్.సౌజన్య, సర్పంచ్ నెబర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. వివిధ జాతులకు చెందిన 42 లేగ దూడలు ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి రైతుకి బహుమతులు, నట్టల నివారణ మందులు, విటమిన్ టానిక్స్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంతకోరు సూర్యనారాయణ, వార్డ్ మెంబెర్ కోన అప్పారావు, పశువైద్యులు బి.సంధ్య, జి.అరుణ, ఎస్.స్వర్ణలత, పాడి రైతులు పాల్గొన్నారు.

వంట పాత్రల వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : మండలంలోని రైవాడ శ్రీషిరిడి సాయిబాబా ఆలయానికి దేవరాపల్లి గ్రామానికి చెందిన వాలేటి మల్లయ్య జ్ఞాపకార్థం అతని కుమారుడు నాగరాజు విజయ దంపతులు, కొత్తూరు సాదు జ్ఞాపకార్థం అతని కుమారుడు రాజు, నమ్మి దేముళ్ళు మూడు వంటపాత్రలను రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మీ నాయుడు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సాయినాథ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-పరవాడ : చట్ట విరుద్ధంగా లాకౌట్ ప్రకటించి కార్మికులకు జీతాలు బకాయిలు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న పరవాడ ఫార్మాసిటీలోని సాయినాథ్ లైఫ్ సైన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం పరిశ్రమ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పరవాడ తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహశీల్దారు అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ యాజమాన్యం కార్మిక చట్టాల్ని ఉల్లంఘించి ప్రభుత్వం నుండి ఏ విధమైన ముందస్తు అనుమతి లేకుండా పరిశ్రమను మూసివేయడం, కార్మికులకు వేతన బకాయిలు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికులకు చట్టపరంగా రావలసిన వేతనాలు, గ్రాట్యుటీ, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎపి లేబర్ కమిషనర్ యాజమాన్యం ప్రాసిక్యూట్ చేయమని ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, బంగారు రాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పశువుల షెడ్లు దగ్ధం

- ఆవుపెయ్యి సజీవదహనం

- రెండు ఆవులకు తీవ్ర గాయాలు

బాధితులను పరామర్శిస్తున్న టిడిపి నేత సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక పల్లపు కాలువ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతులు ఆడారి రామసూరి అప్పారావు, శరగడం లక్ష్మికి చెందిన పశువుల షెడ్లు కాలి బూడిదయ్యాయి. రెండు ఆవుల శరీర భాగాలు మంటల్లో కాలిపోగా, ఒక ఆవు పెయ్యి మంటల్లో సజీవదహనమైంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఎగిసిపడుతున్న మంటలను చూసిన కొంత మంది వాకర్స్ రైతులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైతులు లబోదిబోమంటూ పరుగులు తీశారు. ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. అయితే అప్పటికే పూర్తిగా కాలిపోయాయి. సమాచారం తెలిసిన ఎస్ఐ పి.ప్రసాదరావు, ఎమ్మార్వో ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో ఉషారాణి, వెటర్నరీ డాక్టర్ ప్రదీప్, తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత రైతులను పరామర్శించారు. ప్రమాదం యాదృచ్చికంగా జరిగిందా, లేక ఎవరైనా కుట్రపూరితంగా చేసిందా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను సాయికృష్ణ కోరారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొత్తూరు బ్రిడ్జి, రోడ్లు మరమ్మతులు చెప్పట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ రోడ్లకి శంకుస్థాపన చేసి మూడు నాలుగు నెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కాలేదన్నారు. అనకాపల్లి మండలం కొత్తూరు ఏఎంఏఎల్ కాలేజీ బ్రిడ్జిపై నుంచి వడ్డాది, రావికమతం వరకూ రోడ్ల దుస్థితి చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. తక్షణమే రోడ్లు మరమ్మతులు చేపట్టకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వియ్యపు రాజు, కె వీరాచారి, కే త్రినాద్, విత్తనాల పోతురాజు, నరాలశెట్టి సత్యనారాయణ, ఆడారి రామారావు, యు గణేష్, కే శ్రీనివాస్, శ్రీను, బుజ్జి బాబు పాల్గొన్నారు.

వేడెక్కుతున్న యలమంచిలి రాజకీయం

- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసు ఇచ్చిన వైసిపి కౌన్సిలర్లు
- వైసిపి ఎంపిపి పదవికి రానున్న ముప్పు?
- మున్సిపాలిటీ అధికారం కోల్పోతే ఎమ్మెల్యే ప్రతిష్టకు భంగం

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలిలో రాజకీయం వేడెక్కింది. వైసిపి నుంచి బిజెపిలో చేరిన మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై అవిశ్వాస తీర్మానం చర్చ కొంత కాలంగా జరుగుతుండగా, అనూహ్యంగా బుధవారం వైసిపి కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసును అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు దర్శకత్వంలో యలమంచిలిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైసిపికి చెందిన 19 మంది కౌన్సిలర్లు సమావేశమై అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేశారు. అనంతరం ఆ నోటీసును జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. దీంతో యలమంచిలిలో ఒక్క సారిగా రాజకీయం వేడెక్కింది. రాజకీయ సమీకరణాలపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. అవిశ్వాసంలో వైఎస్ఆర్‌సిపి నుంచి బిజెపిలో చేరిన చైర్‌పర్సన్ రమాకుమారిని కూటమి ప్రభుత్వం రక్షించుకోలేని పక్షంలో ప్రస్తుత జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రతిష్టకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ అవిశ్వాసం కార్యరూపం దాల్చి వైసిపి నెగ్గితే రాష్ట్రంలో ఆ పార్టీ బలపడుతోందన్న నినాదం వెల్లువెత్తే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసిన 19 మందిలో సగం మంది వరకు చైర్‌పర్సన్ రమాకుమారికి టచ్‌లో ఉన్నారన్న సమాచారం వైసిపికి మింగుడు పడటంలేదు.

ఇదే తరుణంలో... వైసిపి మద్దతుదారైన ఎంపిపి బోదెపు గోవింద్‌పై కూడా అవిశ్వాసం ప్రకటించడానికి కూటమి నాయకులు రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మండలంలోని ఏడుగురు ఎంపిటిసి సభ్యులు ఉండగా, వారిలో ఏటికొప్పాక -2 ఎంపిటీసీ మరణించారు. మిగిలిన ఆరుగురులో వైసిపి మద్దతుదార్లు ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వీరిలో ఇటీవల ఆర్థిక ఇబ్బందుల్లో పార్టీ మారి తిరిగి వైసిపి చెంతకు చేరిన జంపపాలెం ఎంపిటిసి శిలపరశెట్టి ఉమా తటస్థంగా ఉన్నట్టు తెలిసింది. ఈ పరిణామాల్లో త్వరలోనే ఎంపిపిపై కూడా అవిశ్వాసం ప్రకటించే అవకాశం ఉందని జనసేన పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దానికి ఎమ్మెల్యే సుందరపు అనుమతి కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిసింది.

మున్సిపాలిటీ రాజకీయంపై త్వరలోనే ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టి సారిస్తారన్న ప్రచారం కూటమి శ్రేణుల్లో జరుగుతోంది. కూటమి ప్రభుత్వ అవగాహన మేరకు మూడు పార్టీలు ఒక తాటిపై నిలవాల్సి ఉన్నా జనసేన ఎమ్మెల్యేకు తెలుగుదేశం సహకరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా నియోజకవర్గంలో తెలుగుదేశం నేతల పనుల్ని ఎక్కడికక్కడ ఎమ్మెల్యే సుందరపు కట్టడి చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అధికారులంతా ఎమ్మెల్యే చెప్పుచేతల్లో పనిచేస్తున్నారన్న వాస్తవం కాదనలేని సత్యంగా ప్రచారం సాగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో యలమంచిలి రాజకీయం ఎటువంటి మలుపులు తిరగనుందో వేచి చూడాలి.

బోరు పనులను ప్రారంభిస్తున్న సత్యనారాయణ, నాగేశ్వరీదేవి

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్నామని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. మండలంలోని పి.భీమవరం గ్రామంలో పలువురు రైతులకు చెందిన పశువుల కల్లాల వద్ద ఎంపీపీ డి.నాగేశ్వరీదేవితో కలిపి బోర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, ఎంపీటీసీ దేవర అప్పారావు, పినపోలు రామదాసు, కంఠంరెడ్డి శ్రీరామమూర్తి, పాల సంస్థ అధ్యక్షులు వలివిరెడ్డిరాజు, రామానాయుడు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్లో సినిమా షూటింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని గాంధీ కూరగాయల మార్కెట్లో గురువారం 24 డేస్ అనే సినిమా షూటింగ్ జరిగింది. దీంతో మార్కెట్ సందడిగా మారింది. సిరి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎన్ని శ్రీనివాస్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుంది. రచయిత, దర్శకుడు కిరణ్ వారియర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు కిరణ్‌కు ఇది రెండవ చిత్రం. గత ఏడాది మెగాస్టార్ ఫ్యాన్ అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రస్తుతం గాంధీ మార్కెట్లో పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. నూతన నటి నటులతో నిర్మిస్తున్న ఈ సినిమాలో ఎన్ని రోహిత్, జీవన్, సందీప్, కాశీరాం, లోవరాజు ఐదుగురు హీరోలుగా నటిస్తున్నారు. హీరోయిన్‌గా సోనమ్ నటిస్తున్నారు. చిత్రం హర్రర్ కామెడీ నేపథ్యంలో సాగుతుందని దర్శకుడు కిరణ్ తెలిపారు. చిత్రాన్ని మే 24న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు.

మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాకు చెందిన హోంగార్డు పప్పుల లక్ష్మి, విశాఖపట్నం కైలాసగిరి ఆర్మ్డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త పప్పుల శంకరరావుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా అందించిన ఒక రోజు డ్యూటీ అలవెన్స్ సహా ఇతర ఆర్థిక సహాయాన్ని కలిపి మొత్తం రూ.4,17,565 చెక్కును ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏఓ ఏ.రామ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ టి.రమేష్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషి మరువలేనిదని సర్పంచ్ దాడి ఎరుకునాయుడు అన్నారు. కె.కోటపాడు మండలం చౌడువాడలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద మాడుగుల నియోజకవర్గం నాలుగు మండలాల పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఎరుకునాయుడు మాట్లాడుతూ పంచాయతీలకు ఆదాయ వనరులుగా సంపద కేంద్రాలు తీర్చిదిద్దాలన్నారు. చీడికాడ ఎంపిడిఒ వి.హేమసుందరరావు, పంచాయతీ విస్తరణ అధికారి పి.గోపి, చౌడువాడ ఎంపిటిసి రొంగలి సూర్యనారాయణ, ఎటుకోరి అప్పలరాజు, వంటాకు గోవిందరావు, రాపేటి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పి.సురేష్ బాబు పాల్గొన్నారు.

టెర్రరిస్టుల దాడులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అనుకోని రీతిలో జరిగే టెర్రరిస్టుల దాడులపై అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉంటూ ఎదుర్కోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ అన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద తగిన సన్నద్ధత ఏర్పాట్లు చేసుకోవాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు, టెర్రరిస్టుల నుంచి జరిగే ప్రమాదాల విషయంలో అందరినీ అలర్ట్ చేసే విధంగా అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆక్టోపస్ సేవలపై సమీక్షలో భాగంగా గురువారం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది.

టిడిఆర్ బాండ్లు మాకొద్దు

- నగదు రూపంలోనే పరిహారం చెల్లించాలి
- తేల్చి చెప్పిన అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులు

ప్రజాశక్తి-మునగపాక

టిడిఆర్ బాండ్లు తమకు వద్దని, నగదు రూపంలోనే పరిహారం చెల్లించాలని అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ రోడ్డు విస్తరణలో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులతో గురువారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ స్థానిక జనసేన కార్యాలయంలో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు మాట్లాడుతూ టిడిఆర్ బాండ్లు ఇవ్వడం వల్ల వాటిని సొమ్ము చేసుకోవడంలో జాప్యం జరుగుతుందని, అంతవరకు పునరావాసం కోల్పోయే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు పలుమార్లు జరిగిన గ్రామసభలలో నష్టపరిహారం ఎంత ఇస్తారో స్పష్టం చేయలేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ ఈ రహదారి విస్తరణకు నగదు చెల్లించేందుకు ప్రభుత్వం వద్ద నిధులులేవని, వీఎంఆర్డీఏ ద్వారా సేకరించే భూములకు ఎక్కడైనా టీడీఆర్ ఇస్తారని తెలిపారు. దీని వలన నిర్వాసితులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. టీడీఆర్ వలన ఇబ్బందులు ఉండవని, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పరిస్థితులను అర్థం చేసుకొని రహదారి విస్తరణకు సహకరించాలని కోరారు. అందుకు నిర్వాసితులు అంగీకరించలేదు. బ్యాంకు ఖాతాలో నగదును జమ చేయకుంటే తమ భూముల అప్పగించేది లేదని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘ నాయకులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుగర్స్ రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తోలిన రైతులందరికీ పేమెంట్లు చేయాలని, గత ఐదు నెలలుగా కార్మికులకు ఇవ్వాల్సిన బకాయి జీతాలు చెల్లించాలని సిపిఎం నాయకులు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చోడవరంలో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఫ్యాక్టరీలో పర్యటన, అనంతరం ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా నేపథ్యంలో ఫ్యాక్టరీ ఎమ్‌డి ఈ నెలాఖరులోపు బకాయిలన్నీ చెల్లించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు జనవరి 21వ తేదీ నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు 20 వేల టన్నుల చెరుకు తోలిన రైతులకు పేమెంట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించడం హర్షనీయమన్నారు. కానీ చెరుకు తోలిన 15 రోజులలోపే పేమెంట్లు చేయాల్సి ఉండగా, నెలల తరబడి ఇవ్వకపోవడం, గతేడాది టన్నుకు రూ.150 చొప్పున ఉన్న బకాయిల్ని కూడా చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరో వైపు వచ్చే సీజన్లో చెరుకు పంటకు ఫ్యాక్టరీ నుంచి గాని, ప్రభుత్వం నుంచి గాని ఎటువంటి హామీ రాకపోవడంతో రైతులు వచ్చే ఏడాది ఫ్యాక్టరీ నడుస్తుందో లేదో అని అనుమానాలతో అయోమయ పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలని, వచ్చే సీజన్‌పై ప్రణాళిక ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు తేలయ్యబాబు, రైతులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు ఈ నెల 29న రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కె.కోటపాడు అయ్యన్న డిగ్రీ కళాశాలలో సుమారు 17 కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి జరుగు జాబ్ మేళాకు 10వ తరగతి, ఐ.టి.ఐ, డిప్లొమా, డిగ్రీ, పిజి చదువుకొని 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల నిరుద్యోగులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా ఎక్కువ రెస్యూమెలు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్‌లతో ఇంటర్వ్యూలు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7981102224, 9494791935 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మంగళాపురంలో చలివేంద్రం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం మంగళాపురంలో దారబోయిన అప్పారావు జ్ఞాపకార్థం వారి కుమారులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామలక్ష్మి, ధారబోయిన కాసులమ్మ, ధారబోయిన నాగభూషణం, ధారబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నెక్) శిక్షణ కేంద్రంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన మహిళలకు టైలరింగ్ కోర్సులో స్వల్ప కాలిక నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అనకాపల్లి జిల్లా నెక్ సహాయ సంచాలకులు ఎస్‌వివిఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 44 ఏళ్ల లోపు వయసు ఉన్న మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు అనకాపల్లి జిల్లాకు చెందినవారై ఉండాలని, శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణా అనంతరం సర్టిఫికెట్‌తో పాటు సంబంధిత రంగంలో ఉపాధి కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని చినబోదిగల్లం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు గురువారం సర్పంచ్ షేక్ మున్నీషా బేగం, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణానికి రూ.9 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ నమోదుకు 31 వరకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రమాదవశాత్తు మరణించిన లేదా పాక్షిక లేదా శాశ్వత అంగ వైకల్యం పొందిన వారు కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కొరకు ఇ-శ్రమ్ పోర్టల్లో పేర్లు నమోదుకు 2025 మార్చి 31వరకు గడువు పొడిగించినట్లు కార్మికశాఖ ఇంచార్జి జిల్లా కమిషనరు కె.వసంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు కార్మికుని ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నెంబర్, కార్మికుని సేవింగ్స్ బ్యాంకు అకౌంట్ నెంబర్, ఐఎఫ్ఎస్సి కోడ్, బ్రాంచ్ వివరములు అవసరమని పేర్కొన్నారు. కార్మికులు స్వయంగా register.eshram. gov.in/# user/self లింక్‌ను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని బంగారమెట్ట, ఎల్‌బీపీ అగ్రహారం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యులకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి అందజేసిన సభ్యత్వం కార్డులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, మాజీ ఎంపిటిసి దొండ శ్రీను, నాయకులు సాయం శేషు ఎంపీటీసీ ఎల్లపు జగ్గారావు, మోదకొండ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డుల బాక్స్ అందిస్తున్న నాయకులు

ప్రశాంతంగా 'స్థానిక' ఉప ఎన్నికలు

● ఏకగ్రీవంగా నాలుగు సిటింగ్ ఎంపిపి స్థానాలను నిలబెట్టుకున్న వైసిపి ● కూటమి ఖాతాలోకి సబ్బవరం వైస్ ఎంపిపి

ఎన్నికైనట్లు ధ్రువీకరణ అందుకుంటున్న ఎంపిపి రుత్తల

ప్రమాణస్వీకారం చేస్తున్న దేవరాపల్లి ఎంపిపి బుల్లి లక్ష్మి

ఎస్.రాయవరం ఎంపిపి వెంకటలక్ష్మికి అభినందన

మాకవరపాలెం ఎంపిపిగా రుత్తల ఏకగ్రీవం

ప్రజాశక్తి- కోటవురట్ల : మాకవరపాలెం ఎంపిపిగా రుత్తల సర్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, మండల పరిషత్ సమావేశం మందిరంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఎంపిపి పదవికి ఉప ఎన్నిక నిర్వహించారు. మండలంలోని 16 మంది ఎంపిటిసిలకు గాను వైసిపికి చెందిన 10 మంది హాజరుకాగా, వారంతా సర్వేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రుత్తల లక్ష్మి ఎంపిపి పదవికి రాజీనామా చేయడంతో ఖాళీఅయిన స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు సిఐ రేవతమ్మ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు కల్పించారు.

ఎంపిపిగా బుల్లిలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక

దేవరాపల్లి : దేవరాపల్లి మండల పరిషత్తు అధ్యక్షులుగా వైసీపీకి చెందిన ఎ.కొత్తపల్లి ఎంపీటీసీ చింతల బుల్లిలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రిసిడింగ్ అధికారి ఎస్.మంజులవాణి ఆధ్వర్యంలో గురువారం ఎంపిపి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 17 మంది ఎంపీటీసీలుగాను 12 మంది ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎన్నికల అధికారి సమక్షంలో 12 మంది ఎంపిటిసిలు చేతులెత్తి ఎంపీపీగా చింతల బుల్లిలక్ష్మిని ఎన్నుకున్నారు. వైసిపి నుండి ఎంపిపిగా ఉన్న కిలపర్తి రాజేశ్వరి 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎంపిపి పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైనది. రాజేశ్వరి, ఆమె భర్త మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు టిడిపిలో చేరిన విషయం విధితమే. కాగా నూతన ఎంపీపీ బుల్లిలక్ష్మిని జెడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, నాయకులు డాక్టర్ సింహాచలం నాయుడు, లలితానాయుడు, ఎ.కొత్తపల్లి, అలమండ, గర్సింగి సర్పంచులు వెంకటరమణ, దాడి జగన్, గుడుపు రాము, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై టి.మల్లేశ్వరరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఎంపిపిగా వెంకటలక్ష్మి ఏకగ్రీవం

ఎస్.రాయవరం : స్థానిక ఎంపిపిగా వైసిపికి చెందిన కొరుప్రోలు ఎంపిటిసి కేసుబోయిన వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్నాళ్ల క్రితం ఎంపిపి పదవికి కోన లోవలక్ష్మి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానానికి ఎన్నికల సంఘం ఆదేశాలతో ఉప ఎన్నిక నిర్వహించారు. ఎస్‌డిసి మనోరమ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండలంలో 20 ఎంపిటిసి స్థానాలకుగాను వైసిపికి 16, టిడిపికి 3, జనసేనకు ఒక సభ్యుడు ఉన్నారు. కూటమికి సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉండగా,వైసిపికి చెందిన కొరుప్రోలు ఎంపిటిసి కేసుబోయిన వెంకటలక్ష్మి ఎంపిపిగా పోటీలో నిలబడ్డారు. వెంకటలక్ష్మి పేరును ఎస్ రాయవరం2 ఎంపిటిసి బొలిశెట్టి గోవిందరావు ప్రతిపాదించగా, వమ్మవరం ఎంపిటిసి బాలం సూరిబాబు బలపరచడంతో ఎన్నిక ఏకగ్రీవమై నట్లు ఎన్నికల అధికారి మనోరమ ప్రకటించారు. ఎంపిడిఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాడుగుల ఎంపిపిగా రాజారాం ఏకగ్రీవం

మాడుగుల : మాడుగుల ఎంపిపిగా వైసిపికి చెందిన తాళ్లపురెడ్డి రాజారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో 21 ఎంపిటిసి స్థానాలకు వైసిపికి 18మంది, టిడిపికి ఇద్దరు, ఇండిపెంటెంట్ అభ్యర్థి ఒకరున్నారు. అప్పట్లో జరిగిన ఎన్నికలో ఎంపిపిగా వేమవరపు రామదర్మజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే రెండున్నరేళ్ల పాటు పదవీ పంపకం ఒప్పందం ఉండడంతో ఇటీవల రామదర్మజ తనపదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్‌ఎంపిపిగా ఉన్న తాళ్లపురెడ్డి రాజారాం ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించారు. తాజాగా ఖాళీ స్థానిక భర్తీకి ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగా, గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి పి.వీరమ్మనాయుడు ఆధ్వర్వర్యంలో ఎంపిపి ఎన్నిక నిర్వహించారు. కెజె.పురం-1 టిడిపి ఎంపిటిసి, కింతలి ఇండిపెండెంట్ ఎంపిటిసి మైచర్ల సన్యాసిరావు మినహా మిగిలిన 19మంది హాజరుకాగా, జమ్మాదేవిపేట ఎంపిటిసి తాళ్లపురెడ్డి రాజారాంను ఎంపిపిగా మాడుగుల-2 ఎంపిటిసి వేమవరపు రాజారాం ప్రతిపాదించగా, మాడుగుల-1 ఎంపిటిసి పొలిమేర్ల విజయలక్ష్మి బలపరిచారు. చేతులెత్తే పద్ధతిన అందరూ రాజారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపిపికి నియామకపత్రం అందించి, పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపిడిఒ కొంకి అప్పారావు కొత్తఎంపిపికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

భూరికార్డులను తారుమారు చేసేశారు!

- పాతమల్లంపేట గదబ గిరిజనుల నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండలం పాతమల్లంపేట గ్రామంలోని ఎస్టీ పీవీటిజీ గదబ ఆదివాసీల సాగు అనుభవంలో 50ఏళ్లుగా ఉన్న భూములను రికార్డులను తారుమారుచేసి భూమాఫియా లాక్కోవాలని చూస్తోందని ఎపి ఆదివాసీ హక్కుల సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు యన్.కల్యాణ్ ఆరోపించారు. గురువారం గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సాగుదారులకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ప్రస్తుత గొలుగొండ మండల తహశీల్దార్ రికార్డులను గత నెల 24వ తేదీన మార్చేసారని, ఇది చట్ట విరుద్ధమని దీనిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆదివాసీ సంఘం జిల్లా కన్వీనర్ మొసూరి రాజు, సూరిబాబు , సాగు రైతులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట : రావికమతం మండలం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పలువురు వికలాంగు విద్యార్థులకు ఆర్టీసీ ప్రయాణానికి బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ మండలానికి చెందిన 14 మంది వికలాంగ విద్యార్థులకు నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ ఆధ్వర్యంలో బస్ పాసులు జారీ చేసారని తెలిపారు. ఇంతకుముదు 70 మంది విద్యార్థులకు బస్ పాస్‌లు ఇచ్చారనివ ఈటి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం రాయితీపై ప్రయాణం చేయవచ్చునన్నారు. అతి తీవ్రత కలిగిన వికలాంగులకు సహాయకులుగా ఉన్న వారికీ కూడా 50 శాతం రాయితీ కల్పిస్తారన్నారు.ఐఇఆర్.పి జగన్నాథ నాయుడు, మేడివాడ పాఠశాల ఉపాధ్యాయులు అప్పలనాయుడు, నాగేశ్వరరావు, ఎర్రయ్య, బ్రహ్మాజీ, రమణాజీ పాల్గొన్నారు.

రోజువారీ సంత వేలం పాట ఖరారు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో సచివాలయం వద్ద నిర్వహించిన బహిరంగ వేలంలో రోజువారి, సంత వేలంపాట ఖరారు అయింది, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీ సూర్యారావు అధ్యక్షతన వేలంపాట నిర్వహించగా, పది మంది ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొన్నారు. రోజువారీ వేలం పాట 90వేలు, వారపు సంత 26వేలు, చెట్లు పలసాయం రూ.10,500లకు అధికమొత్తంలో పాటపాడిన వారికి ఖరారు చేశారు. గ్రామపంచాయతీకి రూ.1,26,500 ఆదాయం లభించింది గ్రామ కార్యదర్శి నరసింహరావు పాల్గొన్నారు.

వైసిపి చేజారిన సబ్బవరం వైస్ ఎంపిపి పదవి

సబ్బవరం వైస్ ఎంపిపి లక్ష్మిని అభినందస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం : సబ్బవరం వైస్ ఎంపీపీ-2గా టిడిపి కూటమి తరుపున నారపాడు ఎంపీటీసీ సభ్యులు మామిడి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి ఎస్.రమామణి, ఎంపిడిఓ పి.పద్మజ ఆధ్వర్యాన ఈ ఎన్నిక జరిగింది. వైస్ ఎంపిపి-2గా ఉన్న వైసిపికి చెందిన చొక్కాకుల గోవింద రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. మండలంలో 19 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా, వైస్ ఎంపిపిగా పోటీ చేసిన మామిడి లక్ష్మికి ఆమెతో పాటు మరో 10 మంది ఎంపీటీసీలు మద్దతు ఇచ్చారు. లక్ష్మి పేరును సబ్బవరం-2 ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు ప్రతిపాదించగా, గొట్టివాడ ఎంపీటీసీ బొండా శేషుకుమారి బలపర్చారు. హాజరైన సభ్యులు చేతులెత్తి లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి ఎస్.రమామణి మామిడి లక్ష్మి చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మామిడి లక్ష్మిని అభినందించారు. 10 మంది ఎంపీటీసీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ, కర్రి కనకరాజు, బోండా సత్యరావు, శరగడం ఝాన్సీ లక్ష్మిరాణి రాము, దొడ్డి సూర్యప్రకాశరావు, బోకం స్వామి నాయుడు, ఆకుల గణేష్, దాడి కన్నంనాయుడు, కర్రి నర్సింగరావు, పడాల వెంకటరమణ, వనం సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైస్ ఎంపిపిగా లక్ష్మి - పదవి నిలబెట్టుకున్న వైసిపి

చోడవరం : చోడవరం వైస్ ఎంపీపీగా అంబేరిపురం ఎంపిటిసి సభ్యులు సరగడం లక్ష్మి (వైసిపి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వైసిపి చెందిన వైస్ ఎంపీపీ బుద్ధ గంగరాజు రెండున్నరేళ్ల ఒప్పందంలో భాగంగా రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కె.రాజేశ్వరి ఆధ్వర్యాన ఎన్నిక జరిగింది. 25 మంది ఎంపీటీసీలుగాను 17 మంది వైసిపికి చెందిన సభ్యులు పాల్గొని సరగడం లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు టిడిపికి చెందిన ఎంపీటీసీలు, వైసిపి తరపున ఎన్నికై టిడిపిలో చేరిన ఎంపీటీసీలు హాజరు కాలేదు. అనంతరం వైస్ ఎంపిపిగా లక్ష్మి చేత ప్రిసైడింట్ అధికారి ప్రమాణ పత్రం చదివించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం వైసిపి శ్రేణులు లక్ష్మిని సన్మానించారు. ఏడువాక సత్యారావు, వైకాపా మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, సరగడం సిమ్మి నాయుడు, దేవరపల్లి సత్య, ఓరుగంటి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం వైస్ ఎంపిపి లక్ష్మి

ఉపసర్పంచ్ పదవులకు తప్పని పోటీ

ఎన్నిక ధ్రువీకరణ స్వీకరిస్తున్న బికె.పల్లి ఉప సర్పంచ్ రాజేశ్వరి

ఉప సర్పంచ్‌గా రాజేశ్వరి ఏకగ్రీవం

కోటవురట్ల: మండలంలో బీకేపల్లి ఉపసర్పంచ్ ఎన్నికను ఇఒపిఆర్‌డి, పంచాయతీ అధికారి ఎంవిఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. పది మంది వార్డు సభ్యులకు ఐదుగురు హాజరుకాగా, సర్పంచ్ లింగన్న నాయుడు మూజువాణి ఓటుతో ఉప సర్పంచ్‌గా పెదపూడి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, గతంలో వున్న ఉపసర్పంచి పెదపూడి లోవరాజు రాజీనామా చేయడంతో ఎన్నిక జరిగింది

రాయపురాజుపేట ఉప సర్పంచ్‌గా రామ్మూర్తి

చోడవరం రూరల్ : మండలంలోని రాయపురాజుపేట గ్రామ ఉప సర్పంచ్‌గా పసుపులేటి రామ్మూర్తి ఎన్నికయ్యారు. గ్రామంలో గురువారం జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికలో ఏడుగురు వార్డు సభ్యులు, సర్పంచ్ కలిపి ఎనిమిది మంది రామ్మూర్తిని ఎన్నుకున్నారు. అనంతరం రామ్మూర్తిని టిడిపి మండల అధ్యక్షులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, గ్రామ సర్పంచ్ రామునాయుడు, పార్టీ పెద్దలు దాడి రమేష్, వెంకటప్పారావు, జయప్రకాష్, గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.

పైడివాడ అగ్రహారం ఉపసర్పంచ్‌గా సరోజిని

సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం ఉప సర్పంచ్‌గా మడక సరోజిని ఎన్నికైనట్లు పంచాయతీ కార్యదర్శి షేక్ ఫాతిమాభి తెలిపారు. ఉపసర్పంచ్ ఎన్నికల అధికారిగా నర్సీపట్నం డివిజనల్ ఎఓ ఏవి నాగలక్ష్మి వ్యవహరించారు. 10 మంది పాలక వర్గం సభ్యులు ఉండగా, మూడో వార్డు సభ్యులు మడక సరోజినికి ఎనిమిది మంది సభ్యులు, సర్పంచ్ వడ్డాది అప్పలరాజు మద్దతు ఇవ్వడంతో సరోజిని ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నూతన ఉపసర్పంచ్‌ను సర్పంచ్, వార్డు సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాపర్తి ముత్యాల నాయుడు, అక్కిరెడ్డి అప్పారావు, రాపర్తి సంతోష్, మధుపాడ పోలినాయుడు, గనిరెడ్డి రామకృష్ణ, అయినం శ్రీనివాసరావు, చిట్టిబోయిన భవాని, గొంతిన జగదీష్, మడక సూరిబాబు పాల్గొన్నారు.

కింతలి ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా

మాడుగుల : మండలంలో నాలుగు పంచాయతీలో ఉప సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయగా, కింతలి పంచాయతీలో ఎన్నిక జరగకపోగా, మిగిలిన మాడుగుల, కెజె పురం, పోతనపూడి అగ్రహారం మూడు పంచాయతీలలో ఎన్నికలు జరిగాయి. మాడుగుల ఉప సర్పంచ్‌గా జవ్వాది వరహాలు, కెజె పురం ఉపసర్పంచ్‌గా సూరిశెట్టి గోవిందరాజు, పోతనపూడి అగ్రహారం ఉపసర్పంచ్‌గా మైచర్ల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు తెలిపారు.వారికి నియామక పత్రాలు అందజేశారు.

పోతనపూడి ఉపసర్పంచ్‌గా ఎన్నికైన మైచర్ల లక్ష్మి

మలేషియాలో చిక్కుకున్న భూషణంను

స్వదేశానికి రప్పించాలి

స్పీకర్ అయ్యన్నను కలిసిన భూషణం కుటుంబీకులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:: మలేషియాలో ఉపాధి కోసం వెళ్లి చిక్కుకున్న మాకవరపాలెం మండలం జీ.నగరం గ్రామానికి చెందిన ఒమ్మి భూషణంను స్వదేశానికి తీసుకురావాలని భూషణం భార్య మంగ, కుటుంబ సభ్యులు కోరారు. గురువారం నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసి విన్నవించారు. దీనిపై వెంటనే స్పందించిన అయ్యన్న, విషయాన్ని మంత్రి లోకేష్ పేషేకి వెంటనే ఫోన్ చేసి వివరాలు తెలియజేశారు. ఇప్పటికే దీనిపై లోకేష్‌తో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ చర్చించినట్టు, సంబంధిత అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి భూషణాన్ని స్వదేశానికి రప్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భూషణం కుమారుడు సాయి, అన్నయ్య ముసలి, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఆర్.వై.పాత్రుడు, చిరంజీవి రాజు, యర్రంశెట్టి వెంకటరమణ, జి.కోడూరు నీటి సంఘం అధ్యక్షులు కళ్యాణ్ రాజు, టిడిపి నాయకులు నిమ్మల వెంకటరమణ, గ్రామ టిడిపి నాయకులు వైబోయిన నానాజీ, రమణ పాల్గొన్నారు.

ఇకెవైసి నమోదులో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ లబ్ధిదారులందరికీ తప్పనిసరిగా ఇకెవైసి చేయించాలని డిప్యూటీ తహశీల్దార్ కాకర నూకరాజు అన్నారు. గురువారం మాకవరపాలెం మండల రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశంలో నూకరాజు మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 46వేల యూనిట్లకు గాను 4200 యూనిట్లకు ఇంకా ఇకెవైసి చేయించాల్సి ఉందన్నారు. సంబంధిత డీలర్ల నుంచి వివరాలు అడిగితెలుసుకున్నారు, డీలర్లకు అందజేసిన జాబితా ఆధారంగా నిర్లక్ష్యం చేయకుండా రేషన్ డీలర్లు ప్రతి ఒక్కరికీ ఇకెవైసి చేయించాలని సూచించారు. అనంతరం డిటి నూకరాజు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు చోటు లేకుండా ఇకెవైసి ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు, రేషన్ కార్డు వినియోగదారులంతా ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ లింక్ అయింది లేనిది పరిశీలించుకోవాలని సూచించారు, ఇప్పటివరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పొందనివారు వెంటనే బుక్ చేసుకోవాలన్నారు.

31లోగా భూవివరాలు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : పీఎం కిసాన్ నిధి లబ్ధిదారులుగా కొనసాగాలంటే ఈ నెల 31లోపు భూమి వివరాలను రైతు రిజిస్ట్రీలో నమోదు చేయాలని గొలుగొండ మండల వ్యవసాయాధికారి కె.సుధారాణి గురువారం తెలిపారు. ఆధార్, భూమి వివరాలతో గ్రామ రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి, రైతు గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రీలో జత చేసుకోవాలని చెప్పారు.

నీటి కష్టాల నుంచి విముక్తి కల్పించండి

ప్రజాశక్తి- మాడుగుల : మండంలోని దొర్లగొట్టివాడ పంచాయతీ ఒకే శివరాంపురం గ్రామంలో పాడైన బోరును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. బోరు పాడైందని అధికారులకు తెలియజేయగా వచ్చి బోరును తీసి మోటారు బిగించారన్నారు. అయితే నీరు రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వాటర్‌ట్యాంకు బాగున్నప్పటికీ, బోరు పాయింట్‌లో సమస్య వల్లే నీటికష్టాలు తప్పడం లేదని వాపోయారు. నాయకులు, అధికారులు స్పందించి కొత్తగా బోర్ పాయింట్ తవ్వించి, దానికి మోటారు అమర్చి, నీటిట్యాంకు ద్వారా నీరు సరఫరా చేయాలని, లేకుంటే కనీసం కొత్త బోరుపాయింట్‌కు బోరు బిగించినా నీటి కష్టాల నుంచి విముక్తి కలుగుతుందని అంటున్నారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

▶▶ వ్యకాస ఆధ్వర్యంలో రోడ్డెక్కి ఆందోళన చేసిన కూలీలు

రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- ఎస్ రాయవరం: మండలంలో వమ్మవరం గ్రామంలో ఉపాధి కూలీలకు పది వారాల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఉపాధి కూలీలందరూ గురువారం రోడ్డెక్కి, దిగ్బంధించారు. గంటపాటు రోడ్డు పైనే బైఠాయించి తమకు కూలీడబ్బులు చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ పదివారాల పాటు పనిచేసిన కూలీలకు ఉపాధి వేతనాలు చెల్లించకుంటే వారి కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఉగాది కొత్త అమావాస్య రంజాన్ పండగల మూడు ఒకేసారి రావడంతో కూలీలకు చేతుల్లో చిల్లిగవ్వ లేకపోవడంతో ఏమి చేయాలలో తెలియక ఆవేదన చెందుతున్నారనానరు. తక్షణమే ఉపాధి వేతన బకాయిలన్నీ విడుదల చేసి, కూలీలు పండగ ఆనందంగా చేసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త ఆర్థికసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటివరకు ఉన్న ఉపాధి బకాయిలన్నీ పూర్తిగా క్లియర్ చేసి, తర్వాత కొత్త సంవత్సరపు పనులు చేపట్టాలని కోరారు. ఉపాధి బకాయిలను రెండురోజుల్లో విడుదల చేస్తామని సంబంధిత మంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించి గడువు దాటినా ఇంకా కూలీల ఖాతాల్లో బకాయి సొమ్ములు జమ కాలేదన్నారు.కార్యక్రమంలో సత్యవతి, రత్నం, కొండమ్మ, నాగమణి,వెంకటలక్ష్మి, సత్యనారాయణ, గోవిందు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని నిరసన

నిరసన తెలియజేస్తున్న సిపిఎం నేతలు. వినియోగదారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : సెకీ ఒప్పందం రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎపిఇపిడిసిఎల్ ఇండోర్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ వైసిపి హయాంలో అదాని సంస్థతో 7వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం జరిగిందన్నారు. ఇందులో రూ.1700 కోట్లు అవినీతి ఆరోపణలను వైసీపీ ఎదుర్కొందన్నారు. అయితే సీఎం చంద్రబాబు ఈ ఒప్పందాన్ని రద్దు చేయబోమని ప్రకటన చేయటాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హిందూజాతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఎనిమిది నెలల్లో ట్రూఅప్, సర్దుబాటు పేరుతో వినియోగదారులపై రూ.15వేలకోట్ల విద్యుత్ ఛార్జీల అదనపు భారం వేశారని విమర్శించారు. ఇపుడు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. మరో పక్కన వివిధ సుంకాల పేరుతో వసూలు చేస్తున్నారన్నారు. అడ్డగోలు ఒప్పందాలతో రానున్న కాలంలో ప్రజలపై తీవ్రమైన విద్యుత్ భారాలు మోయనున్నారని మండిపడ్డారు. విద్యుత్ భారాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.రామకృష్ణ, సత్తిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుపై అధికారుల స్పందన

▶▶ గెడ్డపోరంబోకు ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ యంత్రాంగం

గెడ్డపోరంబోకు ఆక్రమణ తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : పందూరు గ్రామంలో గెడ్డ పోరంబోకు ఆక్రమణపై సప్ప అప్పన్న, తదితరులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. గురువారం తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలతో కలిపి విచారణచేపట్టారు, పూర్వం నుండి పరిసర ప్రాంత రైతులు గడ్డపారంబోకు భూమి నుంచి వ్యవసాయ పనులకు రాకపోకలు సాగించేవారు ఇటీవల కాలంలో సప్ప రాజబాబు అనే వ్యక్తి రైతుల రాకపోకలకు ఆటంకంకలిగించడమే కాక, కొంత మేర ఆక్రమణ చేశారని అందిన ఫిర్యాదుతో రెవెన్యూ సిబ్బంది విచారణ చేశారు., ఆక్రమణలను జెసిబితో తొలగించారు, సందర్భంగా తహశీల్దారు తిరుమల బాబు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. , కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణరావు, డిటి రమేష్, ఆర్ ఐ ఉర్ధవరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్స్యకార సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి నక్కపల్లి : మండలంలోని చిన తీనార్లలో మత్స్యకార సంక్షేమ సంఘం గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మత్స్యకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ కమిటీ ఎంపికలో . గ్రామ శాఖ అధ్యక్షులుగా గరికిన రాజేష్, ఉపాధ్యక్షులు కందాల భూలోకరావు, ప్రధాన కార్యదర్శి కంబాల కొర్లయ్య, ప్రచార కార్యదర్శి గరికిన రాజు, కోశాధికారి సిరిపిల్లి రాజు, కార్యదర్శి సిరిపిల్లి బలరాం, కార్యవర్గ సభ్యులు సిరిపిల్లి జగ్గ, విద్య కమిటీ సభ్యులు కందాల తాతాజీ, భజన కమిటీ సభ్యులు పిక్కి మహేష్, వైద్య కమిటీ సభ్యులు కందాల ఆనంద్, గ్రంథాలయం కమిటీ సభ్యులు కందాల అప్పలరాజు, క్రీడలు కమిటీ సభ్యులు సిరిపిల్లి రాజు, స్వయం ఉపాధి సభ్యులు గరికిన శ్రీనులతో కమిటీని నియమించారు

కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులకు . మత్స్యకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్‌నియామక పత్రాన్ని అందజేశారు. కమిటీ సభ్యులంతా మత్స్యకారులకు అందుబాటులో ఉంటూ, సమన్వయంతో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వాసుపల్లి శివ, కారే దార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మార్కెటింగ్‌తో మేలు

▶▶ డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి

.మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి

ప్రజాశక్తి- నక్కపల్లి : ఓపెన్ నెట్వర్క్ ఈ కామర్స్ (ఒఎన్‌డిసి) వేదిక ద్వారా లభిస్తున్న ఆన్‌లైన్ మార్కెటింగ్ సేవలను వ్యాపారులు వినియోగించుకోవాలని డిఆర్‌డిఎ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎలమంచిలి క్లస్టర్ పరిధిలో నక్కపల్లి, ఎస్ రాయవరం, కోట ఉరట్ల, పాయకరావుపేట, ఎలమంచిలి మండలాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ హాజరై మాట్లాడారు. ఓపెన్ నెట్వర్క్ ఈ కామర్స్ (ఒఎన్‌డిసి)ని వ్యాపారులకు పరిచయం చేశారు. ఓఎన్ డిసి సదుపాయం ద్వారా లభిస్తున్న ఆన్లైన్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ వేదిక ద్వారా వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు చక్కటి అవకాశం ఉందని, వ్యాపారులంతా తమ వ్యాపార రంగంలో ఓఎన్‌డిసిని ఉపయోగించుకుని ఆర్థికంగా బలోపేతం అవ్వాలన్నారు.కార్యక్రమంలో సెంట్రిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిల్ కుమార్, వరప్రసాద్, డిపిఎం ఎల్‌హెచ్, సత్యవేణి, నక్కపల్లి మండల ఎపిఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి స్పీకర్ అభినందన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఒఎన్‌డిసి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా నర్సీపట్నం పురపాలక పరిధిలో మెప్మా సిబ్బందికి ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులు కొనుగోళ్లు మార్చి 8 నాటికి రూ. లక్ష దాటిన సందర్భంగా మూడు వరల్డ్ రికార్డ్సు యూనియన్ సర్టిఫికేట్లు అందాయి. గురువారం నర్సీపట్నంక్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మెప్మా సిబ్బందికి ఆ రికార్డులను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఇంటింటా ఒక మహిళా వ్యాపారవేత్తగా తయారు చేయాలనే ప్రభుత్వం ఆశయాన్ని ప్రతి సభ్యురాలు వినియోగించుకోవాలని సూచించారు. మెప్మా సిబ్బంది ప్రతి వార్డులో సభ్యులకు అవగాహన కల్పించి, ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఉత్పత్తులను మార్కెట్ చేసి, ఉపాధి అవకాశాలను పెంపొందించి అధిక ఆదాయం పొందేలా మహిళలున పోత్సాహించాలన్నారు. సీఓలు బి. రమాదేవి, భాస్కర్, భాను, నూకరత్నం, శ్రీదేవి, సిఎల్‌ఆర్పీలు వరలక్ష్మి, సునీత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		